www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 15 అక్టోబరు 2023

5

ఏలూరు

వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ ఇవ్వాలి

జీలుగుమిల్లి: విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను తొమ్మిది గంటలు నిరంతరాయంగా సరఫరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్రకటిత కరెంట్ కోతలను నిరసిస్తూ శనివారం పి.అంకంపాలెం సబ్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. మండలవ్యాప్తంగా వందల ఎకరాల్లో వరి మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు, చెరకు పంటలు పండిస్తుండగా, గత కొంతకాలంగా వర్షాల్లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ శాఖ అప్రకటిత కరెంట్ కోతలు విధిస్తుండటంతో పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇచ్చే తొమ్మిది గంటల విద్యుత్‌ను కూడా సక్రమంగా ఇవ్వకపోగా వేళాపాళా లేకుండా కరెంట్ కోతలు విధిస్తుండటంతో మోటార్లు కూడా కాలిపోయేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేవిధంగా కోతలు కొనసాగిస్తే పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి వస్తుందని అవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్‌ను సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, సిపిఐఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు..!

ఉంగుటూరు మండలం నాచుగుంటలో బోర్ల నుంచి నీరందక ఎండిన పంటపొలం

చుట్టుముడుతున్న సాగునీటి సమస్య

దెబ్బతింటున్న వరి, మిర్చి వంటి పంటలు

పశువులకు మేతగా వరి పొలాలు

బోర్లు కింద, ఏజెన్సీలో కృష్ణా ఆయకట్టులోనూ ప్రమాద ఘంటికలు

వర్షపాతం లోటుతో కమ్ముకొస్తున్న కరువు

దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి కష్టాలతో జిల్లా రైతాంగం విలవిల్లాడుతోంది. ఈ ఏడాది లోటు వర్షపాతం కారణంగా ఏజెన్సీ, మెట్ట, కృష్ణా ఆయకట్టు ప్రాంతాల్లోని పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. దీంతో అన్నదాతకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లావ్యాప్తంగా 2.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఏజెన్సీ ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడు వంటి మండలాల్లో వేలాది ఎకరాల్లో మిర్చి, పత్తి పంటలను రైతులు సాగు చేసిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం నాలుగు నెలల్లో జులై మినహా జూన్, ఆగస్టు, సెప్టెంబర్ మూడు నెలల్లో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో వర్షాలు లేక జిల్లాను మెల్లమెల్లగా కరువు ఛాయలు కమ్ముకొంటున్నాయి. చాట్రాయి మండలంలో వర్షాధారంగా వేసిన వరిపైరు పశువుల మేతగా మారిపోయింది. సాగునీరు లేక పైరు ఎండిపోవడంతో రైతులు పొలాలను వదిలేస్తున్నారు. చింతలపూడి మండలంలోనూ వర్షాధార పంటంతా దెబ్బతింటోంది. దీంతో వేలాది ఎకరాల్లో వరిపైరు దెబ్బతింది. ఏజెన్సీ మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులో వేలాది ఎకరాల్లో మిర్చి, పత్తి, మినుము, వరి వంటి పంటలను రైతులు సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో సాగునీటి ఇబ్బందులతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గుండేటివాగు, పెదవాగు ప్రాంతాల్లోని సాగును కాపాడుకునేందుకు వాగుల్లో పెద్దఎత్తున నీటిబోరులు వేసి పైపుల ద్వారా పంటను కాపాడుకునేందుకు నిద్రాహారాలు మాని రైతులు పరుగులు తీస్తున్నారు. ఉంగుటూరు, చింతలపూడి, జీలుగుమిల్లి తదితర మండలాల్లో కరెంటు కోతలు విధిస్తుండటంతో సాగునీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయానికి తొమ్మిది గంటల కరెంటు సరఫరా సక్రమంగా అమలుకాకపోవడంతో పొట్టదశలో ఉన్న వరిపొలాలు ప్రమాదంలో పడ్డాయి. ఇదిలా ఉండగా కాల్వ ఆధారిత ప్రాంతమైన పశ్చిమగోదావరి జిల్లాలోనూ సాగునీటి సమస్య తలెత్తుతోంది. ఆచంట మండలం శేషమ్మ చెరువు, పెనుగొండ, అత్తిలి, పాలకొల్లు రూరల్ మండలాల్లో కాల్వ శివారు ప్రాంతాల్లో సాగునీటి సమస్య ఉందని రైతులు వాపోతున్నారు. వంతులవారీ విధానం అవలంబిస్తున్నా ఆక్వా చెరువులకు నీటి మళ్లింపు తదితర కారణాల రీత్యా పూర్తిస్థాయిలో నీరందడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

ఎండుతున్న కృష్ణా ఆయకట్టు

ఏలూరు జిల్లాలోని కృష్ణా ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. కాలువల ద్వారా నీరందకపోవడంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని దుస్థితి ఏర్పడింది. కృష్ణా ఆయకట్టులో దాదాపు 50 వేల ఎకరాలకుపైగా సాగవుతోంది. ఈ ఆయకట్టు పరిధిలో ఖరీఫ్‌లో మాత్రమే వరి పండుతోంది. రబీలో ఆరుతడి పంటలతోనే రైతులు ముందుకు సాగాల్సి ఉంటుంది. సాగునీరు అందకపోవడంతో ఉన్న ఒక్క పంట ప్రమాదంలో పడిందంటూ రైతులు లబోదిబోమంటున్నారు. సాగునీటి సమస్యపై అధికారులు పెద్దగా స్పందించకపోవడంపై రైతుల్లో తీవ్ర విమర్శలు విన్పిస్తున్నాయి. పట్టిసీమద్వారా వెంటనే సాగునీరు విడుదల చేయకపోతే కృష్ణా ఆయకట్టు పరిధిలోని పంటలు దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు అండగా నిలవాలని అంతా కోరుతున్నారు.

నీరు లేక పొలాలు ఎండుతున్నాయి

బైర్నెడి లక్ష్మణరావు, సుంకరవారితోట

కృష్ణా ఆయకట్టు పరిధిలో జాలిపూడి గ్రామంలో పదెకరాలు సాగు చేశాను. ప్రస్తుతం పంట చిరుపొట్ట దశలో ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేలకుపైగా పెట్టుబడి పెట్టాం. సాగునీరు లేక పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. సాగునీరు అందించి పంటను కాపాడాలి.

విద్యుత్ భారాలను నిరసిస్తూ ప్రజాబ్యాలెట్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యుత్ సంస్కరణలు, కరెంట్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్)న్యూ డెమొక్రసీ తదితర వామపక్ష పార్టీలు ఏలూరు ఆర్ఆర్ పేట పార్కు వద్ద ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు కె.నాని మాట్లాడుతూ విద్యుత్ భారాలపై రాష్ట్రవ్యాప్తంగా పది వామపక్ష పార్టీలు వారం రోజుల నుండి ఆందోళనలు నిర్వహిస్తున్నాయని, ఇప్పటికే కరపత్రాల పంపిణీ, ప్రజల నుండి సంతకాల సేకరణ చేపట్టామన్నారు. బిజెపి షరతులు పెడితే వాటిని అంగీకరించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ఛార్జీలు పెంచుతుందన్నారు. 2014 నుండి ఇప్పటి వరకూ విద్యుత్ సంస్థలకు వచ్చిన లోటు కూడా ప్రజలపై వేస్తున్నారని, ట్రూ అప్, సర్దు బాటు, సర్ ఛార్జి, అదనపు ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. ప్రజాబ్యాలెట్ కు సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సెక్రెటరీ బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ప్రజా బ్యాలెట్‌లో దాదాపు 600 మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఓటు వేశారు. 600 ఓట్లలో కరెంట్ ఛార్జీలు పెంచడానికి వ్యతిరేకంగా 588 ఓటు వేయగా, ఏడుగురు అనుకూలంగా ఓటు వేశారు. ఐదు చెల్లని ఓట్లు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.ఆదిశేషు, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, ఎం.ఇస్మాక్, ఎస్.సత్యనారాయణ, సిపిఐ నాయకులు పి.కన్నబాబు, సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, ఎర్ర వెంకటేశ్వరావు, బల్ల కనకదుర్గరావు, సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు క్రాంతి పాల్గొన్నారు.

ప్రజాబ్యాలెట్‌లో పాల్గొన్న నాయకులు, ప్రజలు

ప్రేమాలయం సేవలు ఎనలేనివి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దంపతులు

ప్రజాశక్తి - ఏలూరు

వృద్ధులకు సేవ చేయడం చాలా గొప్పకార్యమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం మధ్యాహ్నం కలెక్టర్, ఆయన సతీమణి డాక్టర్ మానస ఏలూరులోని ప్రేమాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనాధ వృద్ధులకు తోడునీడై, ప్రేమ ఆప్యాయతానురాగాలను చూపిస్తూ ఆశ్రయం కల్పిస్తున్న ప్రేమాలయం సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రేమాలయంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రేమాలయం ప్రాంగణంలో ప్రశాంత వాతావరణం నెలకొని ఉండటం ఆరోగ్యదాయకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రేమాలయం ప్రాంగణమంతా కలెక్టర్ దంపతులు పరిశీలించారు. సకల సౌకర్యాలతోపాటు, వైద్య, ఆరోగ్య సదుపాయాలు కూడా కల్పిస్తూ, వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుతున్న ప్రేమాలయం కమిటీ ప్రతినిధులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ప్రేమాలయంలోని వృద్ధులకు పెన్షన్లు అందుతున్నాయా? లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. అందని వారికి పెన్షన్లు మంజూరు చేయించే చర్యలు తీసుకోవాలని తమ వెంట వచ్చిన ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా తమ తల్లిదండ్రుల పేరిట ప్రేమాలయంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమాలయం కమిటీ గౌరవ అధ్యక్షులు టివి.సుబ్బారావు, కార్యదర్శి మురళీకృష్ణ, కమిటీ సభ్యులు చెన్న వెంకట్రామయ్య, ఆలపాటి నాగేశ్వరరావు, గొర్ల రామారావు, కిరణ్, శేషగిరిరావు, చిత్రాలయ రాంబాబు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ దంపతులు

ఎస్ఐ అభ్యర్థుల తొలిరోజు పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్ష మొదటి రోజు శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 4162 మంది అభ్యర్థులకుగాను ఉదయం పరీక్షకు 52 మంది, మధ్యాహ్నం పరీక్షకు 53 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 8 గంటలకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం సమయానికే ప్రతి అభ్యర్థినీ పోలీస్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి మరీ తనిఖీలు నిర్వహించారు. హాల్ టిక్కెట్‌తోపాటు బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం పరీక్ష 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, రెండో పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహించారు. ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయనతోపాటు ఏలూరు జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, కృష్ణా జిల్లా ఎస్‌పి జాషువా, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి శ్రీధర్, ఏలూరు అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు.

పరీక్షా కేంద్రంలో డిఐజి అశోక్‌కుమార్ పరిశీలన

వివరాలు పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి

పరీక్షా కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

రారెత్తిస్తున్న ఎండలు

ఉక్కపోతతో అల్లాడుతున్న జనం

వేసవిని తలపిస్తున్న భానుడి భగభగలు

ఎండలకు సొమ్మసిల్లుతున్న కూలీలు

ఎండలకు నిర్మానుష్యంగా ఉన్న ముదినేపల్లి ప్రధాన సెంటర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

భానుడి భగభగతో ప్రజలు అల్లాడుతున్నారు. మండలంలో కాస్తున్న ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. మండుతున్న ఎండలకు జనం బెంబేలెత్తుతున్నారు. గత రెండు వారాలుగా ఎండలు మండిపోతున్నాయి. ఇటు జనంతో పాటు అటు పంటలు కూడా ఎండ తాకిడికి పలు గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. మండలంలో ప్రస్తుతం 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఎండ తీవ్రతకు జనం భయపడుతున్నారు. సాధారణంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఆడపాదడపా కురిసే వర్షాలతో వాతావరణం చల్లబడాలి. కానీ ఈఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అక్టోబర్ రెండో వారంలోనే మండు వేసవిని ఎండలు తలపిస్తున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలు వరకూ సూర్యుడు సుర్రుమంటున్నాడు. దీనికి తోడు వేడిగాలుల తీవ్రత సాయంత్రం వరకూ కొనసాగుతుండడంతో జనజీవనంపై ప్రభావం పడుతోంది. ఓ వైపు వరుణుడు ముఖం చాటేయడంతో సార్వా పంట దిగుబడులపై ఎండలు ప్రభావం ఉండవచ్చనే అభిప్రాయం పలువురు రైతులు వ్యక్తం చేస్తున్నారు. అసలే మండలంలో కాల్వల ద్వారా పంట చేలకు సరఫరా చేసే నీరు వంతులవారీ విధానం కొనసాగుతుంది. మరోవైపు ఎండల తీవ్రత పెరగడంతో ఉక్కపోతతో మండల జనం అల్లాడుతున్నారు. రాత్రి సమయాల్లో కూడా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుఅవుతున్నాయి. అలాగే ఎండలకు వ్యవసాయ కూలీలు అల్లాడుతున్నారు. కూలీలు చేలల్లో సొమ్మసిల్లి పడిపోతున్నారు. మండలంలో వరి చేల్లో కలుపు తీతలు ఆడ కూలీలు తీస్తుండగా, మగ కూలీలు చేలపై వ్యాపించిన తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఎండలకు తట్టుకోలేక తరచూ చేల గట్లపై సదతీరుతున్నారు. దీన్ని బట్టి చూస్తే ఎండల తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో తెలుస్తోంది. ఎండలకు ముదినేపల్లి సెంటర్ జనం లేక వెలవెలబోతోంది. మధ్యాహ్న సమయాల్లో ఎండలకు భయపడి జనం బయటకు రాకపోవడంతో ముదినేపల్లి వైకుడలి, గురజ రోడ్డు సెంటర్ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

నగదుతో తెలంగాణా వెళ్తున్నారా.. జర భద్రం

జీలుగుమిల్లి: జేబులో రూ.50 వేలకు మించిన నగదుతో తెలంగాణా రాష్ట్రం వెళ్తున్నారా.. జర భద్రంగా ఉండాల్సిందే అంటున్నారు తెలంగాణా పోలీసులు. తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికల హడావిడి నెలకొనడంతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల గుండా పోలీసులు 24 గంటల పాటు వాహన తనిఖీలు చేపడుతున్నారు. జీలుగుమిల్లి నుంచి అశ్వరావు పేట మూడు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండటంతో ఇక్కడి ప్రజలు నిత్యం అశ్వారావుపేటకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే తెలంగాణా పోలీసులు మాత్రం జీలుగుమిల్లి నుంచి వెళ్లే ఏ వాహనమైనా.. ద్విచక్ర వాహనం నుంచి ఆర్‌టిసి బస్సుల వరకు ఏ వాహనంలో వెళ్లినా క్షుణ్ణంగా పరిశీలించిన పిదపే రాష్ట్రంలోకి అడుగు పెట్టనిస్తున్నారు. దీనిపై ఎస్ఐ ఎస్‌కె.రహమాన్‌ను వివరణ కొరగా ఎన్నికల కోడ్ వున్నందున నగదుకి సంబంధించి ఎటువంటి ఆధారం లేకుండా రూ.50 వేలకు మించి నగదుతో రాష్ట్రంలోకి ప్రవేశిస్తే ఆ నగదును సీజ్ చేసి, అట్టి వ్యక్తులపై కేసు నమోదు చేయాల్సి వస్తుందని ఎస్ఐ తెలిపారు. దానికనుగుణంగా తెలంగాణ పరిసర ప్రాంతాల ప్రజలు సరిహద్దు గుండా ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

గడపగడపకు కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంఎల్ఎ ఆళ్లనాని

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నవరత్నాలతో పేదల జీవితాల్లో గుణాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టామని ఎంఎల్ఎ ఆళ్ల నాని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం స్థానిక 5వ డివిజన్‌లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల అవసరాలను, సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించే లక్ష్యంతో అభివృద్ధి - సంక్షేమానికి సమప్రాధాన్యతనిస్తూ, ముందుకు వెళుతున్నామని తెలిపారు. అన్ని వర్గాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ప్రజల జీవితాల్లో మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తోందన్నారు. రూ.129.20 కోట్ల అమృత్ నిధులతో విలీన గ్రామాలకు సురక్షిత తాగునీటి సరఫరాకు కార్యాచరణ చేపడుతున్నామన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గరికపూడి ఇమ్మానుయేల్ జైకర్, మేయర్ షేక్ నూర్జహాన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, మార్కెట్ యార్డు ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్‌లు ఎన్.సుదీర్ బాబు, గుడిదేసి శ్రీనివాసరావు, వైసిపి నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, నగర కమిషనర్ వెంకటకృష్ణ, అర్బన్ తహశీల్దార్ సోమశేఖర రావు, పలువురు కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం

ఆగిరిపల్లి : పేదలకు బువ్వ పెట్టే ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్క వ్యవసాయ కార్మికుడిపై వుందని ఆగిరిపల్లి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు తెలిపారు. ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు పే స్లిప్‌లు, వేతన బకాయిలు, సమ్మర్ అలవెన్స్‌లు ఇవ్వాలని తెలిపారు. ఆన్‌లైన్ సిస్టం రద్దు చేయాలని కోరుతూ మండలంలో ఆగిరిపల్లి, ఈదులగూడెం, చిన్నాగిరిపల్లి, వడ్లమాను గ్రామాలల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చాకిరి శివనాగరాజు, ఏపూరి రవీంద్ర పాల్గొన్నారు.

ఆకలి తీరేదెలా.. ఆత్మహత్యలు ఆపేదెలా..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సగటు వేతన జీవుల కుటుంబాలు సకాలంలో జీతాలందక పస్తులుంటున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ విధానాల ఫలితంగా పెరిగిన ఒత్తిడితో కొందరు తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడటం అందరినీ కలచివేస్తోంది. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా అధికార పక్షం జగనన్న ఆరోగ్య సురక్ష అంటూ హడావుడిలో నిమగ్నమవ్వగా ప్రధాన ప్రతిపక్షం టిడిపి చంద్రబాబు కోసం నిరసన దీక్షల్లో తలమునకలైంది. వామపక్షాలు ప్రధానంగా సిపిఎం ఎప్పటిలానే వేతన జీవులతోపాటు సామాన్యుల నుంచి చిన్న పెట్టుబడిదారుల వరకూ అందరికీ భారంగా మారిన విద్యుత్ ఛార్జీల రద్దు చేయాలంటూ ప్రత్యక్ష కార్యాచరణలో ముందుకు సాగుతున్నాయి.

ప్రస్తుత కాలంలో మున్సిపల్ స్కూల్ స్వీపర్లు, మాతృభాషా విద్యావాలంటీర్లు, విఒఎలు బకాయి వేతనాల కోసం నిరాహారదీక్షలు, నిరవధిక ధర్నాలు చేపట్టి రోడ్డెక్కారు. వీరిలో మున్సిపల్ స్కూల్ స్వీపర్ల వేతనం కేవలం రూ.4 వేలే. దానికీ ఈ ప్రభుత్వం ముప్పుతిప్పలు పెడుతుందని తెలిసి అంతా నివ్వెరపోయారు. ఎట్టకేలకు జిల్లా అధికారులు స్పందించి వేతన బకాయిలిస్తామని హామీ ఇవ్వడంతో స్వీపర్లు దీక్షలు విరమించారు. విఒఎలు తమ సమస్యలు పరిష్కరించాలని, బకాయి వేతనాల కోసం, ఉద్యోగ భద్రత కోసం 36 గంటలు నిరవధిక ధర్నా నిర్వహించారు. బకాయి వేతనాలు, తమ పరిధిలోని ఇతర అంశాలను పరిష్కరిస్తామని జిల్లా అధికారులు హామీ ఇచ్చారు. మాతృభాషా విద్యావాలంటీర్లకు అయితే గత సంవత్సరానికి సంబంధించి రెండు నెలల బకాయి వేతనాలివ్వాల్సి ఉంటే ఒక నెల వేతనం ఇస్తామని సంబంధిత అధికారులు చెప్పడం వారిని కలిచివేసింది. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న మాతృభాషా వాలంటీర్లు ఒక నెల జీతంతోపాటు మిగిలిన బకాయిలు, సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వీరితోపాటు పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గత నెల జీతం ఇప్పటికీ అందలేదు. అదేసమయంలో వివిధ శాఖల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి సుమారు రెండు నెలలకుపైగా వేతన బకాయిలున్నాయి. ఆ కుటుంబాలన్నీ అర్థాకలితో అలమటిస్తున్నాయి. ఇదిలా ఉండగా నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులు తమకు మెస్ భోజనం నాణ్యతగా ఉండటం లేదని, దీనివల్ల తాము పస్తులుంటున్నామని ఆందోళన చేపట్టారు. తమ ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటి అనేది ప్రతిష్టాత్మక సంస్థ. అలాంటి సంస్థలో విద్యార్థులు ఎక్కడెక్కడి నుంచో వచ్చి చదువుకుంటుంటారు. అంతటి ప్రతిష్టాత్మకమైన సంస్థలోని మెస్‌లో భోజనం సరిగాలేదని విద్యార్థులు ఆందోళన చేపట్టాల్సి రావడం నిజంగా పర్యవేక్షణాలోపమే. నూజివీడు సబ్ కలెక్టర్, ట్రిపుల్ ఐటి డైరెక్టర్ హామీతో విద్యార్థులు ఆందోళన విరమించారు. గతంలోనూ తాడేపల్లిగూడెంలోని నిట్ విద్యార్థులు భోజనం విషయంలో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గకుండా అధికారుల పర్యవేక్షణ పెరగాల్సి ఉందని స్పష్టమవుతోంది. లేనిపక్షంలో జిల్లాలో అటు చిరుద్యోగులు, వేతనజీవులు, ఇటు విద్యార్థుల ఆకలితో అలమటించే ప్రమాద ఘంటికలు పొంచి ఉన్నాయి.

ఇదిలా ఉండగా ప్రభుత్వ విధానాల ఫలితంగా పెరిగిన ఒత్తిడితో గ్రామస్థాయి చిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతుండటం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది. గణపవరం మండలం జల్లికాకినాడ వాసి ఉండి మండలం కోలమూరులో సర్వేయర్‌గా పని చేస్తూ పని ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడటం అందరినీ కలచివేసింది. రీసర్వే పేరుతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా చిరుద్యోగులపై అధికారుల ఒత్తిడి పెరగడం, కొన్నిచోట్ల దుందుడుకుగా, అవమానకరంగా మాట్లాడుతుండటంతో గ్రామస్థాయి ఉద్యోగులు మానసికంగా కుంగిపోతున్నారు. ఇదే విధంగా ఏలూరు జిల్లాలో లింగపాలెం మండలంలో తనపట్ల పిహెచ్‌సి వైద్యురాలి వ్యవహార్‌శైలిని తట్టుకోలేక ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అందరికీ తెలిసిందే. మొత్తంగా పరిశీలిస్తే ప్రభుత్వ విధానాల ఫలితంగా జీతాలందక, ఇటు అధికారుల ఒత్తిడి పెరిగి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చిరుద్యోగులు ఆకలితో అలమటిస్తూ.. అవమానాలు తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడే పరిస్థితులు దాపురించాయనేది స్పష్టమవుతోంది.

ఇక సిపిఎస్‌తోపాటు జిపిఎస్‌నూ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని జిల్లాలో యుటిఎఫ్ ఆధ్వర్యాన పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభమైంది. వ్యవసాయ విద్యుత్ కోతలు ఆపాలని రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారు. విద్యుత్ భారాలను ఉపసంహరించాలని సిపిఎం, వామపక్షాల ఆధ్వర్యాన ప్రచారం, ప్రజాబ్యాలెట్ నిర్వహణ, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో రెండు జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో అధ్వానంగా తయారైన రోడ్లకు మరమ్మతులు చేసి అభివృద్ధి చేయాలంటూ సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్రలు, మోటార్ సైకిల్ యాత్రలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో వివిధ తరగతుల ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా వామపక్షాలు మినహా అటు అధికారపక్షం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఆర్భాటం చేస్తుండగా, ప్రతిపక్ష టిడిపి చంద్రబాబును జైలు నుంచి విడుదల చేయాలంటూ దీక్షలకే పరిమితమవుతుండటం జిల్లావాసుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో దీని ప్రభావం ఆయా పక్షాలపై కచ్చితంగా పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు

నేడు ప్రారంభించనున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉప్పాకపాడు, బొమ్మిడి, కాగుపాడు, రావులపర్రు గ్రామాల్లో రూ.2 కోట్లకు పైగా ప్రభుత్వ నిధులతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఈనెల 15 తేదీన ఎంఎల్‌ఎ వాసుబాబు ప్రారంభిస్తారని వైసిపి మండల కన్వీనర్ మంగారావు, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సచివాలయ భవనాలు, రక్షిత తాగునీటి పథకాలు, రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. వాటిని ఎంఎల్‌ఎ ప్రారంభించనున్నారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ఉంగుటూరు : కైకరంలో రెండు అంగన్‌వాడీ సెంటర్లను విజిలెన్స్ కమిటీ సభ్యుడు కోనే వీర వెంకట సత్యనారాయణ తనిఖీ చేశారు. స్టాక్, రికార్డ్ పరిశీలించారు. విద్యార్థులకు అందించే పౌష్టికాహారం కూడా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తోట దుర్గ, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

పురుషోత్తం మరణం తీరని లోటు : బాబూరావు

ముదినేపల్లి : మాల మహానాడు నాయకుడు మద్దాల పురుషోత్తం ఆకాల మరణం మాల మహానాడుకు తీరని లోటని కృష్ణా మాల మహానాడు అధ్యక్షులు డాక్టర్ సేవా నాగాజన్ బాబూరావు తెలిపారు. మండలంలోని కోడూరుకు చెందిన పురుషోత్తం గుండెపోటుతో శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న బాబూరావు విచ్చేసి పార్థివ దేహాన్ని సందర్శించి, అంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషోత్తం తన సోదరి జిల్లా మాల మహానాడు మహిళా అధ్యక్షురాలు చీలి లావణ్యతో కలిసి ఎన్నో దళిత సంఘాల సమావేశాల్లో పాల్గొన్నారన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని సందర్శించి అంజలి ఘటించిన వారిలో మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసుపోగు దానియేలు, జక్కుల విజయకుమార్ ఉన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారమివ్వాలి

ఉంగుటూరు : మండలంలోని నాచుగుంట గ్రామ పరిధిలో విద్యుత్ కోతలతో సాగునీరు అందక ఈనిక, పొట్ట దశలో ఉన్న పంట పొలాలను స్థానిక రైతులతో కలిసి జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు శనివారం పరిశీలించారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న జగన్ రైతుల పాలిట రాక్షసుడుగా తయారయ్యాడని గన్ని ధ్వజమెత్తారు. రైతులకు విద్యుత్ ఎప్పుడూ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఏడుగంటలు కూడా ఒకే దఫా విద్యుత్ ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వ పాలనలో ఉన్నామని తెలిపారు.

నేటి నుంచి దసరా మహోత్సవాలు

నూజివీడు రూరల్ : పట్టణంలోని శ్రీకోట మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఇఒ యార్లగడ్డ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. 9 రోజులపాటు నిర్వహించే ఈ నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా రామారావు పుట్టినరోజు వేడుక

కలిదిండి : రాష్ట్ర గౌడ సంఘం వైస్ ఛైర్మన్, వైసిపి కైకలూరు నియోజకవర్గ నాయకులు పోసిన చెంచు రామారావు పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కలిదిండిలోని ఆయన నివాసం వద్ద అభిమానుల మధ్య కోలాహలంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. అనంతరం

వృద్ధాశ్రమంలో నిత్యావసరాలు అందిస్తున్న రామారావు

మద్దవానిగూడెం అర్‌సిఎం చర్చి ప్రాంగణంలో గ్రామస్తుల నడుమ కేక్ కట్ చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. తామరకొల్లులోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో వృద్ధులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, పండ్లు, స్వీట్స్ అందజేశారు. గుర్వాయిపాలెంలో రామారావు యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. రామారావుకు గుర్వాయిపాలెం సర్పంచి బత్తిన ఉమామహేశ్వరరావు, యువ నాయకుడు పోసిన రాజ్ భరత్, ఉపసర్పంచి నల్లూరి మహాలక్ష్మీ నరసింహారావు, గోనెపాడు సర్పంచి బత్తిన శ్రీకాంత్, ఆచవరం సర్పంచి కట్టా నాగరాజు గౌడ్, రాచపట్నం, ఆలపాడు సర్పంచులు అల్లూరి మంగారావు ట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

యువకుడు ఆత్మహత్యాయత్నం

చాట్రాయి : మండలంలోని ఆరుగొలను పేటగ్రామానికి చెందిన తిరివీధి శ్రీనివాసరావు శనివారం పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న పెట్రోల్ బంకులోని పెట్రోల్ తీసుకొని, ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డుపై నిలబడి పెట్రోలు ఒంటిపై పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకెళితే భార్యాభర్తల మధ్య శుక్రవారం గొడవ జరగడంతో తన భార్య సరిత పుట్టింటికి వెళ్లి తిరిగి రానందున మనస్తాపంతో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించి పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఎస్‌ఐ కెసిహెచ్.స్వామి వెంటనే స్పందించి కాలిపోతున్న శ్రీనివాసరావు ఒంటిపై ఉన్న మంటను ఆపే ప్రయత్నంలో ఎస్‌ఐకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108లో విసన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లి ప్రథమ చికిత్స నిర్వహించి, అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం జాయిన్ చేశారు. శ్రీనివాసరావుతో ఎస్‌ఐ స్వామి, ఎఎస్‌ఐ గజపతిరావు, సిబ్బంది వెళ్లారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పది మందిపై కేసు

నూజివీడు రూరల్ : మండల పరిధిలోని రావిచర్ల శివారు ప్రాంతంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న పది మంది వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపితే కేసు నమోదు చేస్తామని, అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించరాదని తెలిపారు. వ్యక్తులపై కేసు నమోదు చేసి, రెండు వాహనాలను సీజ్ చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ముసునూరు : అప్పుల బాధ తట్టుకోలేక గడ్డి మందు తాగి వ్యక్తి మరణించిన సంఘటన మండలంలోని లోపూడి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిన్ని ధర్మారావు కుమారుడు చిన్ని ముత్యాలరావు(30) ఈనెల 10న తమ్మిలేరులో అప్పుల బాధ తట్టుకోలేక పురుగు మందు తాగినట్లు, తమ భార్యకు ఫోన్లో సమాచారం తెలపగా, కుటుంబ సభ్యులు నూజివీడు ఏరియా అమెరికన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ఏరియా ఆసుపత్రికి తరలించగా శనివారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మరణించాడు. ముసునూరు ఎస్‌ఐ ఎం.కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న మినీలారీ పట్టివేత

ముసునూరు : కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కుటుంబరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం శనివారం మండల కేంద్రమైన ముసునూరు బోర్డు బల్ల వద్ద ఎస్‌ఐ ఎం.కుటుంబరావు తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, మినీ లారీలో కోళ్ల వ్యర్థపదార్థాలను హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఏలూరు జిల్లా పెదపాడు మండలం వడ్డెర గ్రామంలోని చేపల చెరువులకు తరలిస్తున్నట్లు డ్రైవరు తెలపడంతో, మినీ లారీ యజమానిపై, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

జాలిపూడి పంచాయతీ నిధులు పక్కదారి..!

వ్యక్తిగత ఖాతాల్లోకి జమ

గ్రామాభివృద్ధి గాలికి..

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అసలే నిధులు లేక పంచాయతీలు వెలవెల పోతుంటే.. ఉన్న అరకొర నిధులను పంచాయతీ అధికారులు చేతివాటం ఆరోపణలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. కంచె చేను మేసిన చందంగా.. అధికారులు చేతివాటం చూపడం ఆ పంచాయతీకి శాపంగా మారింది. ఏలూరు గ్రామీణ మండలం 'జాలిపూడి' పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయన్న వార్తలు ఇప్పుడు ఆ పంచాయతీని కుదిపేస్తున్నాయి.

ఏలూరు మండలం జాలిపూడి పంచాయతీ కార్యదర్శులుగా ఇరువురు కార్యదర్శులు విధులు నిర్వహించారు. వీరిలో ఒక కార్యదర్శి 2021-2022లో రూ.10.23 లక్షలు పన్నుల రూపంలో వసూలు చేయగా, మరో రూ.43 వేలు స్వాహా చేసినట్టు అధికారుల విచారణలో బహిర్గతమైంది. ఇక గ్రామ సర్పంచి కూడా తానేమీ తక్కువ కాదన్నట్టు 2021-2022లో రూ.12.95 లక్షలు, 2022-2023లో రూ.1.44 లక్షలు పంచాయతీ నిధులు కార్యదర్శుల సహకారంతో తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 2022 తరువాత విధులు చేపట్టిన మరో కార్యదర్శి 2023లో రూ.5.59 లక్షలు దారి మళ్లించారని అధికారుల విచారణలో బయట పడింది. వెంకటాపురం పంచాయతీగా ఉన్నప్పుడు ఒక కార్యదర్శి కోట్లలోనే దోపిడీకి పాల్పడ్డారని సమాచారం. కార్పొరేషన్‌లో కలిసిపోయినా కూడా వెంకటాపురం మీద మమకారం వదల లేక నేటికి పాత తేదీలతో పంచాయతీ అప్రూవల్స్ బిల్డింగ్ అనుమతులు, కుళాయి కనక్షన్స్, అక్రమ లే అవుట్లు వంటి అనుమతులు ఇచ్చి ప్రజల నుంచి లక్షల్లో ముడుపులు గుంజుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అభివృద్ధి ఏదీ..?

ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో కొన్నాళ్లుగా అభివృద్ధి కుంటుపడింది. ఎక్కడ చూసినా రోడ్లు, మరే ఇతర అభివృద్ధి పనులు కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోయాయి. పంచాయతీలో ఎక్కడా కూడా సరైన అభివృద్ధి జరగలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సర్పంచి, పంచాయతీ కార్యదర్శులు బిల్లులను పెట్టుకొని వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేసుకోవడం ఇప్పుడు మరింత అనుమానాలకు తావిస్తోంది. సుమారు రూ.20 లక్షల పైచిలుకు పంచాయతీ నిధులను వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు పక్కదారి పట్టించే వారిపై చర్యలు తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పవన్‌పై సిఎం అనుచిత వ్యాఖ్యలు దారుణం : జనసేన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మానసిక స్థితి సరిగా లేక సిఎం జగన్‌మోహన్ రెడ్డి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేక ఈశ్వరయ్య తెలిపారు. శనివారం జనసేన ఆధ్వర్యంలో సామర్లకోట ప్రభుత్వ బహిరంగ సభలో సిఎం జగన్ పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ జగన్ మహిళలను కించపరిచే విధంగా నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలే అధికార ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఆకుల రాకేష్, జిల్లా కార్యదర్శి గురుజు ఉమామహేశ్వరీ, షేక్ పీరు, చింతల నాని, కోరే రంగనాధ్, మడకా రవి, సత్తిబాబు, సూరవరపు శేషుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయటం సిగ్గు చేటని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన వీర మహిళలు అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం నియోజకవర్గ జనసేన కార్యాలయం వద్ద జనసేన వీర మహిళలు, నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి చెప్పుకోవటానికి ఏమి లేక ప్రతిపక్షాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. సిఎం దిగజారుడు వ్యాఖ్యలు సరికాదన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో వచ్చే వ్యతిరేకత చూసి వారిలో భయం పుట్టిందని, జనసేనకి ప్రజల్లో వచ్చే ఆదరణ ఓర్వలేక ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రే ఈ విధంగా మాట్లాడితే ప్రజలకి ఏ సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల జనసేన అధ్యక్షులు పంది రాంబాబు, వీర మహిళలు చిత్తూరి పార్వతి, అంబటి మాధవి, మౌనిక పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ముదినేపల్లి

జగనన్న ప్రభుత్వం చేసే అభివృద్ధిని, ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి తీసుకువెళ్లి ప్రచారం చేయాలని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు కోరారు. మండలంలోని సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు జరిగిన మండల స్థాయి శిక్షణా సమావేశంలో ఎంఎల్‌సి జగమంగళ వెంకటరమణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆర్‌వివి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపిలు సిహెచ్ సునీత పాల్గొన్నారు.

అడ్‌హాక్ కమిటీ తప్పిదాలే ఆటోనగర్ గొడవలకు కారణం

మాజీ అధ్యక్షులు నాగభూషణం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు ఆటోనగర్ అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా జరిగిన విధ్వంసంలో తన పాత్ర లేదని, అడ్‌హాక్ కమిటీ చేసిన తప్పిదాలే వారికి శాపంగా మారాయని అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మాగంటి నాగభూషణం తెలిపారు. శనివారం ఏలూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తమ ప్యానల్ మొత్తాన్ని వివిధ కారణాలతో అనర్హులుగా ప్రకటించిన కారణంగానే వివాదానికి కారణమైందన్నారు. అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న కర్రి నాగేశ్వరావుకి ఆటోనగర్‌లో 600 గజాలకు బదులుగా 12,00 గజాలు ఎలా వచ్చిందని, అది నా భిక్ష కాదా అని ప్రశ్నించారు. ఆటోనగర్ కమిటీలోని 30 మంది నాయకులు, 126 మంది సభ్యులు 26,900 గజాలు లబ్ధి పొందటం నిజం కాదా అని ప్రశ్నించారు. ఆటో నగర్ నిర్మాణం దోస సత్యం, తాళ వెంకటేశ్వరవు నిర్మించారని చెబుతున్నారని, వాస్తవానికి వారికేమి తెలియదన్నారు. రాష్ట్రంలో 200 ఆటోనగర్‌లు ఉండగా ఏలూరు, భీమవరం ఆటోనగర్‌లను మాత్రమే ఎపి ఐఐసివారు ప్రయివేటు సంఘాలకు అప్పగించారన్నారు. ఆటోనగర్‌ను కష్టనష్టాలకు ఓర్చి అభివృద్ధి చేస్తే.. దాని ఫలాలు కోసుకోవడానికి అందరూ ఎగబడుతున్నారని విమర్శించారు. శుక్రవారం జరిగిన వివాదానికి కారణం ఎంపీ, ఎంఎల్‌ఎలే అన్నారు. అడ్‌హాక్ కమిటీ కాలం రెండు నెలలు పూర్తయ్యాయని, మినిట్స్ బుక్ ఎత్తుకుపోయి దొంగ సంతకాలు పెట్టి, ఎన్నికలకు వెళ్లడం చట్టరీత్యా నేరమన్నారు. మినీ బైపాస్ వద్ద ఉన్న 100 మందికి స్థలాలు ఇస్తామని చెప్పి కర్రి నాగేశ్వరావు ఎన్నికల పేరిట హడావుడి చేస్తున్నారని తెలిపారు. వాస్తవానికి ఓటర్ల జాబితాలో 312గా ఉందని, వాస్తవానికి 286 మంది మాత్రమే ఉన్నారన్నారు. అధికారులకు కమిటీతో సంబంధం లేదని, కేవలం ఇది ప్రయివేట్ అసోసియేషన్‌కే సంబంధించిందన్నారు. కమిటీతో ఎలాంటి సంబంధంలేని ఎంపీ శ్రీధర్‌కి సంబంధించిన ఇద్దరు న్యాయవాదులు ఎన్నికల కేంద్రంలోకి ఎందుకు వచ్చారని ఆయన ప్రశ్నించారు. కర్రి నాగేశ్వరరావుకి గడువు పూర్తైందని, ఇకముందు సంఘం కార్యక్రమాలు ఏమైనా చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటానని మాగంటి నాగభూషణం హెచ్చరించారు.

విద్యతోనే ఆర్థికాభివృద్ధి

టి.నరసాపురం : ఉన్నత విద్యతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని బొర్రంపాలెం కెనరా బ్యాంక్ మేనేజర్ దత్త సాయి తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా జ్యోతి పథకంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం మేనేజర్ దత్త సాయి నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన తెలిపారు. విద్యార్థులు బాల్యం నుంచే మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎండి ఆలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 106 మందికి పరీక్షలు

ఏలూరు : లయన్స్ క్లబ్, శ్రీకృష్ణా హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 106 మందికి వైద్య సేవలు అందించి, ఉచితంగా వారికి అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మార్కెటింగ్ ఛైర్‌పర్సన్, నాయకులు పాల్గొన్నారు.

జామాయిల్ ప్లాంటేషన్ పరిశీలన

జీలుగుమిల్లి : మండలంలోని పి.అంకంపాలెం, ములగలంపల్లి అటవీ శాఖ పరిధిలో కటింగ్‌కి వచ్చిన జామాయిల్ ప్లాంటేషన్‌లను శనివారం ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి శాఖ ఆర్‌ఎమ్.సచిన్ గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్ పరిధిలో పూర్తిగా తయారై కటింగ్ చేసిన 100 జామాయిల్ మొక్కలకు సంబంధించిన డేటాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజియన్ పరిధిలో మొత్తం 2,500 హెక్టార్ల పంట కటింగ్‌కి వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తం పంటను కటింగ్ చేసి టింబర్ డిపోకి తరలించి, అటవీ అభివృద్ధికి దోహదపడనున్నట్లు ఆయన సూచించారు. ఆయనతో పాటు ఏలూరు, రాజమండ్రి డిఎమ్‌లు సత్యం, జయశ్రీ, డిఎమ్ఒ సురేష్ పాల్గొన్నారు.

అందుబాటులోకి ఎరువులు

నూజివీడు రూరల్ : మండలంలోని రైతులకు కావాల్సిన ఎరువులను రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచామని వ్యవసాయాధికారి జి.విద్యాసాగర్ తెలిపారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన రైతులకు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తుందని, ఉద్యాన పంటలకు రాయితీలు, సబ్సిడీపై యంత్ర పరికరాలు, కావలసిన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.

కాపుల అభ్యున్నతికి కృషి : ఎంఎల్‌ఎ

కళ్యాణ మండపానికి స్థలం మంజూరు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కాపుల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని పేర్కొన్నారు. ఏలూరు ఐక్య కాపునాడు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కాపు ప్రముఖులు శనివారం ఆళ్ల నానిని మర్యాద పూర్వకంగా కలిశారు. కాపులకు ఎన్నో ఏళ్ల కలైన కళ్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు స్పందించిన ఆళ్ల నాని కాపు కళ్యాణ మండపం కోసం సుమారు 2,300 గజాల స్థలం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ కాపు నేస్తం పథకం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల మధ్య గల మహిళలకు ఏటా రూ.15 వేలు అందిస్తున్నామని తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలోనే గత నాలుగేళ్లలో సుమారు తొమ్మిది కోట్ల రూపాయలకు పైగా నిధులు కాపు అక్కా, చెల్లెమ్మలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. కాపు వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నామని, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో కాపు వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. తమ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఆళ్ల నానికి సదరు నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా డోర్ టు డోర్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



ముసునూరులో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న నేతలు

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపి ఆధ్వర్యంలో టౌన్‌లో డోర్ టు డోర్ షాపులు తిరుగుతూ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అరాచక పాలనను ప్రజలకు వివరించారు. బాబుతో నేను కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సోంబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ యండ్రప్రగఢ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన టిడిపి నిరసన దీక్షలు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో నిర్వహిస్తున్న పోలవరం నియోజకవర్గస్థాయి టిడిపి నిరసన దీక్షలు శుక్రవారం సాయంత్రంతో ముగిసినట్లు పార్టీ టౌన్ కన్వీనర్ జేష్ఠ రామకృష్ణ తెలిపారు. చంద్రబాబు అరెస్టుతో 34 రోజుల పాటు నిరసన దీక్షలు నిర్వహించామని, పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు 13తో ముగించామన్నారు. 14వ తేదీ నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాలలో రోజుకొక గ్రామంలో దీక్షా శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

చింతలపూడి : జైల్లో చంద్రబాబు నాయుడుకి భద్రత లేదని ముందు నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నాం, ఇప్పుడు మేము చెప్పిందే జరిగిందని టిడిపి మాజీమంత్రివర్యులు పీతల సుజాత తెలిపారు. చంద్రబాబునాయుడుని అంత మొందించాలని కుట్ర జరుగుతుందని, ఎపి ప్రజలు, టిడిపి కార్యకర్తలు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ముసునూరు : 'ప్రజావ్యతిరేక, అరాచక ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి' అంటూ పసుపు సైన్యం తమ ప్రచార పోరును ఉధృతం చేసింది. నూజివీడు నియోజకవర్గ టిడిపి మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నేతృత్వంలో శనివారం ముసునూరు మండలం, వలసపల్లి గ్రామంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. తొలుత ఆయన క్షేమాన్ని కోరుతూ గ్రామంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, కందుల పిచ్చయ్య, మెదరమెట్ల సురేంద్ర, లక్కపాము కాంతారావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును పురస్కరించుకొని శనివారం టిడిపి నాయకులు బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మండలంలోని బొమ్మినంపాడు గ్రామంలో మండల టిడిపి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటా తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నరసింహరావు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కోమటితిప్ప గ్రామానికి చెందిన పెన్మెత్స ప్రసాదరాజు, తండ్రి: రామరాజు అనే నేను గత నెల సెప్టెంబరు 28వ తేదీన గ్రామం నుండి **J6380634 అనే నెంబరు గల పాస్‌పోర్టు** తీసుకుని మొగల్తూరు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యంలో జారి పడిపోయినది. పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

పెన్మెత్స ప్రసాదరాజు
తండ్రి: రామరాజు, కోమటితిప్ప,
మొగల్తూరు మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 85003 72677

పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ లిస్ట్, టిసి పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట పంచాయతీ పరిధి చింతల తోట గ్రామానికి చెందిన కోలాటి విన్ను, తండ్రి: వెంకటేశ్వరరావుకు చెందిన అడ్మిన్ నెంబర్ 12435, తమ పదవ తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్, టిసి, హాల్ టికెట్ నెంబర్: **1110109349, సర్టిఫికెట్ నెంబర్: KK0288110, పుట్టిన తేదీ: 30-07-1996.** ఉద్యోగ నిమిత్తం ఆచంట నుంచి మహారాష్ట్రం వెళ్ళగా అక్కడి నుంచి ఇంటర్వ్యూకు వెళ్లే నిమిత్తం బస్సులో వెళ్తుండగా నా ఒరిజినల్ సర్టిఫికెట్లు కలిగి ఉన్న బ్యాగ్ పోయినది. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియ పరచగలరు.

కోలాటి విన్ను
తండ్రి: వెంకటేశ్వరరావు, డో.నెం.25/12,
ఆచంట చింతల తోట, ఆచంట మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్,
పిన్ కోడ్: 534123. సెల్: 76748 44035

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి :: తణుకు
ఓ.యస్. 324/2020

బిట్వీన్:
వాది: పుల్లూరి అనంత లక్ష్మి
మరియు
ప్రతివాది: చేబ్రోలు రాజేశ్వరి

పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారు మీయొక్క హాజరు నిమిత్తం పలుమార్లు సమన్లు ఆర్డరు వేసియున్నప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై నెంబరు దావా **ది.16-10-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు వాయిదా అయి ఉన్నది.** ఆరోజు నుండి నెల రోజులు లోపల మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల పరోక్షముగావింపబడుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎన్.వి.ఎస్.ఎస్.పి.రామమోహన్
ఎన్.వి.ఎస్.రామానుజం
అడ్వకేట్స్, తణుకు.
తణుకు, సెల్: 99088 22433
13-10-23. 98483 69653

గౌరవనీయులైన కృష్ణా జిల్లా 15వ అదనపు జిల్లా జడ్జి నూజివీడు వారి కోర్టులో
ఇ.ఎ.నెం. 3/2023
ఇన్ ఇ.పి.నెం. 4/2019
ఇన్ ఓ.యస్.నెం. 47/2018

బిట్వీన్:
1) నారాయణ గోపి కృష్ణ
2) వనమా వెంకటేశ్వరరావు ...వాదులు
మరియు
దూపగుంట్ల కిషోర్ ...ప్రతివాది

టు: ప్రతివాది:
దూపగుంట్ల కిషోర్, తండ్రి: వెంకటేశ్వరరావు, హిందూ, వయస్సు 46 సం॥లు, నివాసం: గంధర్వా అపార్టుమెంటు, నూజివీడు, ఏలూరు జిల్లా.

పై నెంబరు ఇ.ఎ.లో ప్రతివాది అయిన మీరు పైన పేర్కొనిన శ్రీ కోర్టు వారు సదరు ఇ.ఎ.లో డెలివరీ నిమిత్తం నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు నోటీసును తీసుకొనకపోవుట వలన గౌరవ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా **ది.19-10-2023 వ తేదీన ఉన్నది. సదరు తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయం గా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురు.

మడుపల్లి మధురవి శంకర్
నూజివీడు, వాది తరపు న్యాయవాది
13-10-2023. నూజివీడు.

ఎంపికైన విద్యార్థినిలతో ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి పోటీల్లో రామశింగవరం విద్యార్థుల సత్తా

పెదవేగి (ఏలూరు టౌన్) : జిల్లాస్థాయి త్రోబాల్ ఎంపిక పోటీల్లో పెదవేగి మండలం రామశింగవరం జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థినిలు సత్తా చాటారు. అండర్ 14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 12, 13 తేదీల్లో తణుకులో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన చలమాల దివ్యశ్రీ, అండర్-17 విభాగంలో దుక్కిపాటి సంజన అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినిలను, వారికి శిక్షణ ఇచ్చిన పిడి జమ్మా రామకృష్ణలను శనివారం పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివి.పద్మావతి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

మహారాజశ్రీ ప్రిన్సపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో తణుకు :: పశ్చిమ గోదావరి జిల్లా
ఓ.యస్. 645/2019

వాది: కాయల సత్తెమ్మ
ప్రతివాదులు: మేకా వెంకట రాజ్యలక్ష్మి వగైరా
1వ ప్రతివాది: మేకా వెంకట రాజ్యలక్ష్మి, భర్త: (లేటు) నాగేశ్వర్రావు, డోర్ నెం.12-67, బ్యాంకు కాలనీ గేవియర్ నగర్, ఏలూరు.

వాది తరపు దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావాలో 1వ ప్రతివాదికి ఎన్ని పర్యాయములు దావా సమన్లు కట్టిననూ అమలు జరుగుటలేదు మరియు ఐ.ఎ. 2015/2019 పిటీషన్లోను నోటీసులు అమలు జరుగుటలేదు. అందువలన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము ఈ పబ్లికేషన్ ప్రచురించిన తేదీ లగాయితూ 30 రోజులలో పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని అడ్వొకేట్ గారి ద్వారా గాని హాజరు కావలెను. అట్లు కాని ఎడల మీ పరోక్షములో ముందు గ్రంధము జరిపించబడును. కనుక తెలియచేయడమైనది.

వాయిదా: 30-10-2023.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
కె.యస్.యల్.యన్.ప్రసాద్,
న్యాయవాది, తణుకు, ప॥గో॥జిల్లా.

వేలం ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టులో
ఇ.పి.నెం. 268/2017
ఇన్ ఓ.ఎస్.నెం. 286/2015

బిట్వీన్:
శ్రీ చింతా రాజారావు ...డి.హెచ్.ఆర్ /వాది
అండ్
శ్రీమతి దామర్ల రాధిక ...జె.డి.ఆర్ /ప్రతివాది

పై నెంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు కొరకు జె.డి.ఆర్. సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములు గల ఈ క్రింది స్థిరాస్థి షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టు వారి ఎదుట **ది.03-11-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు భహిరంగ వేలం వేయుదురు.** కావున యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకోవచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

షెడ్యూలు ఆస్తి వివరము: పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, వట్లూరు సబ్ రిజిష్టారు యిలాకా, పెదపాడు మండలం, నెహ్రూ నగర్, 10వ రోడ్డు, డో.నెం. 9-11-20 దాఖలా 300 చ॥గ॥ల స్తలమునకు హద్దులు:
తూర్పు: పోరంబోకు స్తలం 31 అ॥లు.
దక్షిణం: మాగంటి బాబి గారి స్తలం 89 అ॥లు.
పడమర: రాజవీధి 31 అ॥లు.
ఉత్తరం: పి.నందం గారి సరిహద్దు గోడ 86 అ॥లు.
ఈ హద్దుల మధ్య 300 చ॥గ॥ల స్తలం వేలం వేయుదురు.

డి.హెచ్.ఆర్. విలువ : రూ.8,00,000/-
అమీనా విలువ : రూ.20,00,000/-

కిళాంబి జె.వివశ్వంత
అడ్వకేట్, మాగంటి వారి వీధి
ఏలూరు, ఆర్.ఆర్.పేట, ఏలూరు.
15-10-23. సెల్: 94406 64371

గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి నూజివీడు వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 257/2021
ఇన్ ఓ.యస్.నెం. 135/2018

బిట్వీన్:
బెత్లెహేమ్ చారిటబుల్ ట్రస్టు, రిప్రజెంట్ బై ఇట్స్ ప్రెసిడెంట్. ...పిటీషనరు /వాది
మరియు
2) గుండె సుందరపాల్
3) కాటూరి ఏసు రత్నం
4) పులివర్తి ఝాన్సీరాణి
5) పీట పంగిడమ్మ
6) కె.సురేష్ ...ప్రతివాదులు /రెస్పాండెంట్లు

టు: రెస్పాండెంట్లు /ప్రతివాదులు:
2) గుండె సుందరపాల్, తండ్రి: సుశేశ్వరరావు, క్రిస్టియన్, వయస్సు 52 సం॥లు, సోషల్ వర్కర్, డో.నెం. 20-7-28, గ్రేస్ ఇంగ్లీష్ మీడియం స్కూలు, శాంతి నగర్, విజయవాడ-520003.
3) కాటూరి ఏసురత్నం, తండ్రి: అంకమ్మ, క్రిస్టియన్, వయస్సు 56 సం॥లు, పాస్టర్, నివాసం: కర్రలపాలెం, బాపట్ల దగ్గర, గుంటూరు జిల్లా, పిన్ నెం.520003.
4) పులివర్తి ఝాన్సీరాణి, భర్త: వేమూరి మురళీ మోహన్, క్రిస్టియన్, వయస్సు 36 సం॥లు, నివాసం: జి.పీటర్ సింగ్ చర్చి దగ్గర, ప్రసాదంపాడు, విజయవాడ-520003.
5) పీట పంగిడమ్మ, భర్త: రంగారావు, వయస్సు 38 సం॥లు, చొప్పరమెట్ల గ్రామం, ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.
6) కె.సురేష్, తండ్రి: నాట్ నౌన్, క్రిస్టియన్, ఆటో డ్రైవర్, వయస్సు 26 సం॥లు, నివాసం: కె/ఆఫ్ పులవర్తి ఝాన్సీరాణి, జి.పీటర్ సింగ్ చర్చి దగ్గర, ప్రసాదంపాడు, విజయవాడ, పిన్ నెం.521108.

పై నెంబరు ఓ.యస్.నెంబరులో ప్రతివాది అయిన మీరు పైన పేర్కొనిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గాను వాయిదా **ది.06-12-2023వ తేదీన ఉన్నది. సదరు తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించుదురు.

గుడ్డేటి కృష్ణ
నూజివీడు, న్యాయవాది, నూజివీడు.
14-10-23.